

కుర్చీలు వదలరా..?

ఓ ఫార్మాసిస్టు గత 35 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా కర్నూలుకు రావాలనే ఆశతో బదిలీలకు ఆప్షన్ పెట్టుకున్నారు. కానీ కర్నూలు జీజీహెచ్, రీజనల్ ఐ-హాస్పిటల్స్‌లో పాతిక, ముప్పై ఏళ్లుగా తిష్ట వేసినవాళ్లు కదిలేలా లేరు. పైగా గుర్తింపు పొందిన యూనియన్ల సిఫారసు లెటర్ తెచ్చుకున్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్న పల్లెటూరి ఫార్మాసిస్టుకు దిక్కుతోచడం లేదు. కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులో గత 16 ఏళ్లుగా ఓ మినిస్టీరియల్ స్టాఫ్ తిష్ట వేశారు. మరో ఉద్యోగి 14 ఏళ్లుగా కుర్చీ కదలడం లేదు.





- 32 ఏళ్లుగా ఒకే చోట తిష్ట
- 27 ఏళ్లుగా కర్నూలులో
- వైద్య ఆరోగ్యశాఖ, కర్నూలు జీజీహెచ్‌లో సీట్లు మారని ఉద్యోగులు
- బదిలీలకు రెండు రోజులే

కర్నూలు హాస్పిటల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో ఓ సీనియర్ అసిస్టెంట్ 16 ఏళ్ల తిష్ట వేశారు. అందులోనూ 10 ఏళ్లుగా ఆదాయం వచ్చే సీటులో కొనసాగుతున్నారు. ఈసారి కూడా ఆ ఉద్యోగికి ఓ యూనియన్ సిఫారసు లేఖ ఇచ్చింది. మెడికల్ గ్రౌండ్స్ కింద ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే మరో అధికారి కూడా జోనల్ క్యాడర్‌లో లాంగ్ స్టాండింగ్ ఉన్నారు. ఆ అధికారికి కూడా సిఫారసు లేఖ ఉంది. ఇంకా ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.

వైద్య ఆరోగ్య, కర్నూలు బోధనాసుపత్రి, రీజినల్ ఐ-హాస్పిటల్‌లో కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయాయి. కొందరు సిల్వర్ జూబ్లీ వేడుకలు పూర్తి చేసుకున్నారు. మరికొందరు 32 ఏళ్లుగా ఉన్నారు. కీలకమైన కర్నూలు జీజీహెచ్, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో 16 ఏళ్ల దాటినా కదలడానికి ససేమిరా అంటున్నారు. ఈసారి సాధారణ బదిలీల్లో అన్ని సర్వీసులు కలుపుకుని 9 సంవత్సరాలు పూర్తయిన ఉద్యోగులు, ఆఫీస్ బేరర్లను కూడా బదిలీ చేయాలని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. అదే సీనియర్ అసిస్టెంట్లకు 3 సంవత్సరాలు పూర్తయితే బదిలీ చేయాల్సిందే. అయితే ఈ ప్రభుత్వ నిబంధనలను వైద్యఆరోగ్యశాఖలో కొంతమంది ఉద్యోగులు, అధికారులు తుంగలో తొక్కుతున్నారు. ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు ఈసారైనా కర్నూలుకు రావాలని ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే నగరంలో పాతుకుపోయిన ఉద్యోగులు మాత్రం కుర్చీలు వదలడానికి సిద్ధంగా లేరు. దీని కోసం అడ్డదారులు తొక్కుతున్నారు ఎలాగైనా అక్కడే తిష్ట వేయాలని ఎత్తుగడలు పన్నుతున్నారు. కొందరు రాత్రికి రాత్రి ఆఫీస్ బేరర్లుగా నియామక పత్రాలతో బదిలీ కాకుండా చూస్తున్నారు. జిల్లాలో ఇవ్వకుంటే రాష్ట్ర నాయకుల వద్ద నుంచి సిఫారసు లేఖలను తెచ్చుకుంటున్నారు.



కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయం



వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగులు, వైద్యుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 19వ తేదీలోపు బదిలీలు పూర్తి చేసి 23వ తేదీ విధుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, రీజినల్ ఐ-హాస్పిటల్ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కొందరు ఉద్యోగులపై అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీన్ని అరికట్టడానికి వైద్యఆరోగ్య శాఖ కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇతర శాఖల మాదిరిగా కాకుండా బదిలీ నిబంధనలను వైద్య ఆరోగ్యశాఖ కోసం సడలించారు. ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలక సిబ్బందిని బదిలీ చేయాలని నిర్ణయించింది.

మిగతా 6వ పేజీలో

యోగా జీవనశైలి కావాలి

- హాజరైన మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో 5200 మంది ఉద్యోగులతో యోగా





యోగాసనంలో కలెక్టర్, ఎస్పీ



యోగాసనం చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిగా మారాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో 5200 మంది ఉద్యోగులతో నిర్వహించిన మెగా ఈవెంట్ యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, జేసీ విష్ణుచరణ్, జిల్లాస్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దైనందిన జీవితానికి యోగా చాలా మేలు చేస్తుందని అన్నారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యోగా కార్యక్రమం చేపట్టారని అన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఐదు పర్యాటక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా మాట్లాడుతూ అందరితో కలిసి యోగా చేయడం వల్ల మానసిక ఉత్తేజకరంగా ఉందని అన్నారు. జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ జిల్లాలో ఏడున్నర లక్షల మంది యోగా శిక్షణకు రిజిస్టర్ చేయించుకున్నారని, వారికి 380 మాస్టర్ ట్రైనర్స్, 4900 మంది ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని అన్నారు.



యోగాలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రహ్లాదజోషికి స్వాగతం పలికిన ఎంపీ, కలెక్టర్, ఎస్పీ

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కేంద్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాదజోషి కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అలాగే కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి మంత్రాలయానికి చేరుకుని పద్మనాభతీర్థ అతిథి గృహంలో బస చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం ఆలయ ముఖద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని హారతులు ఇచ్చారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేసి ప్రహ్లాదరాయల పాదపూజలో పాల్గొని తరించారు. సాయంత్రం కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. రాత్రి రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, పట్టువస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి కేంద్రమంత్రిని సత్కరించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, సభ్యుడు నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, రాయచూర్ కలెక్టర్ నితీశ్, ఎస్పీ పుట్ట మాదయ్య, ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు, ఎస్ఈ ఉమాపతి, డీఈ పురుషోత్తం, ఏఈ గోవిందు, జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రాజగోపాల్, టీడీపీ నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్, కేంద్ర ఇండిపెండెంట్ డైరెక్టర్ గిరీష్ ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రవి, నార్త్ జోన్ శ్రీమఠం విచారణకర్త శ్రీనివాస కస్బే ఉన్నారు.



శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి, ఎంపీ బస్తిపాటి నాగరాజు

కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరాలయం

శ్రీశైలానికి కొనసాగుతున్న వరదజలాలు

కొత్తపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రలలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు వరదజలాలు వచ్చి చేరుతుండటంతో నదీ గర్భంలో ఉన్న సప్తనదుల సంగమేశ్వరాలం కృష్ణా నది ఒడిలోకి చేరుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులకు గాను 842.40 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 215 టీఎంసీలకుగాను 65.457 టీఎంసీలుగా నమోదైంది. సంగమేశ్వరాలయం జలాధివాసం అవుతున్న అద్భుత దృశ్యాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. ఎగువ ఉమామహేశ్వరాలయంలోని స్వామివారిని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



కృష్ణమ్మ ఒడిలో చేరుతున్న సంగమేశ్వరాలయం

అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలి: కలెక్టర్

- పీజీఆర్ఎస్‌కు 172 వినతులు



పీజీఆర్ఎస్‌లో బాధితుడి సమస్య వింటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజలనుంచి కలెక్టర్, జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 172 వినతులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలనుంచి స్వీకరించిన విజ్ఞప్తులను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు.

బియ్యం దొంగలు ఎవరు..?



7

ఈనెల 13న అర్ధరాత్రి గోదాముకు వేసిన తాళం ఈనెల 14న ఉదయం తెరుస్తున్న ఆదోని డిప్యూటీ తహసీల్దారు బాబు

114 వినతులు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు వచ్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి వచ్చిన సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. ఫిర్యాదులన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీకి 60 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఏపీ మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా సోమవారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షలకు 60 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన ఎస్ఏ-సోషల్ పరీక్షకు మొత్తం 872 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 38 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో నిర్వహించిన ఎస్ఏ-సోషల్ పరీక్షకు 870 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 22 మంది గైర్హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

జిల్లాలో 5,763 మంది ఉపాధ్యాయుల బదిలీ

- 944 మందికి పదోన్నతులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ కడప పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పని చేస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పదోన్నతులతో పాటు బదిలీలు జరిగాయి. గ్రేడ్-2 హెచ్ఎంలు 134 మంది, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు 406, ఎస్ఏలు, తత్సమానమైన కేటగిరీలో 2,788 మంది, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 2273 మంది, బాషా పండితులు 119 మంది, పీఈటీలు 32 మంది, ఆర్ట్ క్రాఫ్ట్, మ్యూజిక్ ఇతర ఉపాధ్యాయులు 11 మంది కలిపి మొత్తం 5,763 మంది బదిలీ అయినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. అలాగే గ్రేడ్-2 హెచ్ఎంలు 141 మంది, ఎస్ఏలు(నాన్ లాంగ్వేజ్) 169 మంది, ఎస్ఏలు(లాంగ్వేజ్) 12 మంది, ఎస్ ఏలు(ఫిజికల్ ఎడ్యుకేషన్) 8మంది, ప్రైమరీ స్కూల్స్ హెచ్ఎంలు 614 మంది మొత్తం 944 మంది పదోన్నతులు పొందినట్లు ఆయన తెలిపారు. పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన స్థానాల్లో చేరినట్లు డీఈవో తెలిపారు.

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు హాస్పిటల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్స్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 10 కేటగిరి ఉద్యోగాల అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టు, సెలెక్షన్ లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. సెలక్షన్ లిస్టులను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్, కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను, రెండు సెట్ల నకలు సర్టిఫికెట్లతో ఈనెల 19న ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. హాజరుకాని అభ్యర్థుల ఎంపికను రద్దు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కుర్చీలు వదలరా...?



5వ పేజీ తరువాయి

అన్ని సర్వీసులను కలుపుకుని తొమ్మిదేళ్లు దాటిన వారు, ఆఫీస్ బేరర్లు అయిన వారు, మెడికల్ సర్టిఫికెట్ ఉన్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించింది. అయితే క్యాష్, పలుకుబడి, కులాల ఆధారంగా కొందరిని సంఘాల్లో ఆఫీస్ బేరర్స్‌గా చేర్చుకుని సిఫార్సు లేఖలు అందజేసినట్లు సమాచారం. ఇటీవల ఓ ఉద్యోగ సంఘానికి ప్రభుత్వం గుర్తింపును తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో సంఘం నుంచి సిఫారసు లేఖల కోసం డబ్బులు ఇచ్చిన వాళ్లు అందోళన పడుతున్నారు. ఆ సంఘం నుంచి వచ్చే సిఫారసు లేఖలు పక్కన పెట్టాలని ఆదేశాలు రావడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. ఇచ్చిన డబ్బుల కోసం నాయకుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

● **జోనల్‌లో అధికంగా సిఫారసు లేఖలు:** వైద్యఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) కార్యాలయానికి గుర్తింపు పొందిన సంఘాల సిఫారసు లేఖలు ఎక్కువగా ఉన్నాయి. కడప జోన్-4 క్యాడర్లలో ఏపీ ఎన్జీవో 76 మంది, ఏపీజీఈఏ సంఘం 76 మంది, ఏపీ హంస 68 మంది, ఐఎన్‌టీయూసీ సంఘం 8 మంది, ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఆరుగురికి సిఫారసు లేఖలు ఇచ్చాయి. . ఇందులో కీలకమైన సీనియర్ అసిస్టెంట్లు ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సంఘం 19 మందికి అత్యధికంగా ఇచ్చింది. . ఏపీజీఈఏ సంఘం ఏడుగురు 7 మంది ఏపీ హంస సంఘం 14 మంది, ఐఎన్‌టీయూసీ సంఘం ఒక్కరికి ఇచ్చారు. ఎంపీహెచ్ఎస్ ఉద్యోగులకు ఏపీఎన్‌జీవో 10 మంది, ఏపీజీఈఏ-11, హంస-4, ఎంపీహెచ్ఈవో క్యాడర్లలో ఏపీఎన్జీవో-15 మంది, ఏపీజీఈఏ-18, హంస-5, ఎంపీహెచ్ఎస్ఎం క్యాడర్లలో ఏపీఎన్జీవో-22, ఏపీజీఈఏ-18, ఏపీ హంస-15 మందికి సిఫారసు లేఖలు ఇచ్చారు.

ఏళ్లుగా తిష్ఠ వేసిన ఉద్యోగులు

- ఓ ఫార్మసీ ఆఫీసర్ రీజినల్ ఐ-హాస్పిటల్, 31 సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్నారు. కడప జోనల్ క్యాడల్‌లో ఫార్మసీ ఆఫీసర్ లాంగ్ స్టాండింగ్‌లో మొట్టమొదటి పేరు ఇదే ఉండటం విశేషం.
- కర్నూలు జీజీహెచ్‌లో ఓ ఫార్మసీ ఆఫీసర్ 27 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్‌లో రెండో స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్ పరిపాలన విభాగంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి 18 సంవత్సరాలుగా తిష్ఠ వేశారు. ఆయన జోనల్ క్యాడల్ లాంగ్ స్టాండింగ్ లిస్టులో మొదటి స్థానంలో ఉన్నారు.
- కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులో ఓ ఉద్యోగి 16 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. ఆ ఉద్యోగి జోనల్‌లో లాంగ్ స్టాండింగ్‌లో మూడో స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఓ ఉద్యోగి 15 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. గత 10 సంవత్సరాలుగా ఒకే సీటులో విధులు నిర్వహించడం విశేషం. ఆ ఉద్యోగి లాంగ్ స్టాండింగ్ జోనల్‌లో 5వ స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్‌లో పని చేస్తున్న ఓ స్టాఫ్ నర్సు అత్యధికంగా 16 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్ స్టాఫ్ నర్సుల జోనల్ లిస్టులో 2వ స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ స్టాఫ్ నర్సు 14 సంవత్సరాలుగా పని చేస్తున్నారు.
- కర్నూలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గత 14 సంవత్సరాలుగా ఇక్కడే ఉన్నారు.

ఇది చాలా అన్యాయం



గుర్తింపు పొందిన అసోసియేషన్లు రోసా నిబంధనలకు విరుద్ధంగా బైలాకు వ్యతిరేకంగా ఆఫీస్ బేరర్ల సర్టిఫికెట్లు కేటాయించడం నేరం. ఈ విషయాన్ని గుర్తింపు పొందిన సంఘాలు ఆలోచించుకోవాలి. లేదంటే భవిష్యత్తులో ఉద్యోగులే తిరగబడే అవకాశం ఉంటుంది. సీహెచ్‌వో రాష్ట్ర క్యాడల్‌లో 68 మంది లాంగ్ స్టాండింగ్ ఉండగా.. ఇందులో 65 మందికి ఆఫీస్ బేరర్ల సర్టిఫికెట్లు ఉండటం పరిస్థితికి అద్దం పడుతుంది. సిఫారసు లేఖలు ఉన్న వారు ఏళ్లుగా సిటీలోనే తిష్ఠ వేశారు. ఇది అన్యాయం.

-ఎం.నాగరాజు, ఏపీ తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

యంత్ర సేవల్లేవు

- చాలా వరకు మూలన పడ్డ కియోస్కో యంత్రాలు
- కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఏర్పాటు
- ఒక్కో యంత్రానికి సుమారు రూ.80వేలు
- వైసీపీ ప్రభుత్వ అసమర్థతతో కోట్ల నిధులు దుర్వినియోగం
- వినియోగంపై అన్నదాతలకు కల్పించని అవగాహన
- సెల్‌ఫోన్లతోనే రైతులకు సమాచారం



చాగలమర్రిలో అద్దె భవనంలో ఆర్ఎస్‌కే కేంద్రం

చాగలమర్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాగుదారులు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు వీలుగా కోట్లు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన కియోస్కో యంత్ర సేవలు అందడం లేదు. ఆ యంత్రాలు రెండేళ్లకే మూలకు పడ్డాయి. ప్రారంభంలో యంత్రాల ద్వార అరకొర సేవలు అందించిన కొద్దిమంది మాత్రమే ఎరువులు, పురుగు మందులు, యంత్రాల ద్వారా కొనుగోలు చేశారు. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల్లోని యంత్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)కు వచ్చి స్వయంగా తమకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అవసరమైన పరిమాణంలో కియోస్కో యంత్రాల ద్వార నమోదు చేసుకోవచ్చు. తరువాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. అన్నదాతలకు వీటిపై అవగాహన కల్పించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా మారాయి. ఒక్కో యంత్రానికి రూ.80 వేలు దాక ఖర్చు చేశారు. మొదటి ఏడాదిలో నామమాత్రంగా పనిచేశాయి. 2023 నుంచి యం త్రాల వినియోగం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో కియో స్కో యంత్రాల ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.

ఉమ్మడి జిల్లాలో 877 రైతు భరోసా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో రైతులకు సేవలు అందించడానికి 877 రైతు సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి కేంద్రానికి రూ.80వేల విలువైన కియోస్కో యంత్రం ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 కియోస్కో యంత్రాలను ఇచ్చారు. వివిధ సమస్యలతో 180 యంత్రాలు పని చేయడం లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కియోస్కో యంత్రాలు పని చేస్తే వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. అక్రమాలు చేయడానికి వీలు ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు సిబ్బంది సాంకేతిక ఇబ్బందులు తదితర కారణాలతో కియోస్కోల వాడకాన్ని తగ్గించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎరువుల అమ్మకానికి సంబంధించి రూ.48 లక్షల వరకు బకాయిలను వ్యవసాయ సిబ్బంది చెల్లించాల్సి ఉంది. సీజన్‌లో ఎరువుల అమ్మకాలు జరుగుతున్నప్పుడే వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేస్తే సిబ్బంది ఎప్పటికప్పుడు నగదు చెల్లింపులు చేస్తారు. రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేసిన క్రమంలో నాన్‌సబ్సిడీ చెల్లింపులకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ.10 లక్షల వరకు ఏపీ సీడ్స్‌కు బకాయిలు ఉన్నట్లు సమాచారం. రైతులు చెల్లించిన మొత్తాన్ని కొందరు వ్యవసాయ సిబ్బంది తమ సొంతానికి వాడుకున్నట్లు సమాచారం.

మూలనపడ్డ యంత్రాలు

ఖరీఫ్, రబీలో కియోస్కో యంత్రాల ద్వార విత్తనాలు, ఎరువుల, పురుగుమందులు ఇస్తుంటారు. యంత్రాలు పనిచేయకపోవడంతో సుమారు 70 శాతం మంది రైతులు ప్రైవేటు వ్యాపారుల నుంచి విత్తనాలు, ఎరువులు తెచ్చి సాగు చేసుకుంటున్నారు. ఆయా కేంద్రాల్లో కియోస్కో యంత్రాలు మూలకు చేరాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రస్తుతం అన్ని సేవలు సెల్‌ఫోన్లలోనే అందిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలు పని చేయకపోవడం వాస్తవం. బయోమెట్రిక్ విధానం లేక పోవడంతో సెల్‌ఫోన్ ద్వారానే వినియోగిస్తున్నాం. కియోస్కోల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

● రంగనేతాజీ, ఏవో, చాగలమర్రి

సెల్‌ఫోన్‌లోనే సేవలు

ప్రస్తుతం గ్రామ స్థాయిలో పనిచేసే వీఏఏలు, ఎంపీఈవోలు, వీహెచ్ఏలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, యంత్రాలు, యంత్ర పరికరాలు, ఈ-పంట నమోదు తదితర విషయాలు సెల్‌ఫోన్‌లోనే నమోదు చేస్తున్నారు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు తదితర సేవలన్నీ సెల్‌ఫోన్‌లోనే తెలుసుకునే అవకాశం ఉంది. దీంతో లక్షలాది రూపాయలు విలువ చేసే కియోస్కోలు మూలకు చేరాయి. యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

రైతులకు శుభవార్త

- బయోమెట్రిక్ అవసరం లేదు.. ఆధార్ ఓటీపీతోనే ఈకేవైసీ
- అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల లబ్ధిదారుల హర్షం
- ఉమ్మడి జిల్లాలో ఈకేవైసీ పూర్తికాని అన్నదాతల సంఖ్య 10,604

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాలకు రైతులకు బయోమెట్రిక్ అవసరం లేదని ఈ ఏడాది ఈకేవైసీయే పూర్తిచేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన కింద ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించారు. ఇటీవల అన్నదాత సుఖీభవకు రైతుల నుంచి బయోమెట్రిక్ తప్పనిసరి అంటూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఇప్పటికే ఈకేవైసీ 95శాతం పూర్తయ్యింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో సమయం లేదని, రైతులను ఏ మాత్రం ఇబ్బందులకు గురిచేయవద్దంటూ మరో రెండు రోజుల్లో ఈకేవైసీ వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలతో బయోమెట్రిక్ విధానాన్ని నిలిపివేసి ఈకేవైసీ పూర్తి చేయని రైతులపై దృష్టిసారించారు. త్వరితగతిన ఆధార్ ఓటీపీ ద్వారా ఈకేవైసీ పూర్తిచేయాలని గ్రామస్థాయిలో వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకు ఈనెల 20వతేదీన విడుదల చేయబోయే సహాయం వారి ఖాతాలో జమకావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది.

ఉమ్మడి జిల్లాలో పూర్తికాని ఈకేవైసీ ప్రక్రియ

ఉమ్మడి జిల్లాలో 10,604 మంది రైతులు ఇంకా ఈకేవైసీ పూర్తి చేయలేదు. కర్నూలు జిల్లాలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకానికి 2,55,265 మంది లబ్ధిదారులను గుర్తించగా 2,49,251 మంది రైతులు ఈకేవైసీ పూర్తిచేశారు. 6014 మంది రైతులు ఈకేవైసీ చేయాల్సి ఉంది. నంద్యాల జిల్లాలో 1,85,297 మంది లబ్ధిదారులను గుర్తించగా 1,80,707 మంది ఈకేవైసీ పూర్తిచేశారు. 4590 మంది లబ్ధిదారులు పూర్తిచేయాల్సివుంది. మొత్తం రెండు జిల్లాల్లో 10,604 మంది లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తిచేసేందుకు అధికారులకు రెండు రోజులు గడువు ఇచ్చారు. దీంతో గ్రామస్థాయిలో ఉండే వ్యవసాయాధికారులు వందశాతం ఈకేవైసీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. రెండురోజుల్లో లబ్ధిదారుల అభ్యంతరాలపై గ్రామ రైతు సేవాకేంద్రాల్లో జాబితాను ప్రదర్శించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఈకేవైసీతోనే ప్రభుత్వ ప్రోత్సాహకాలు



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన పథకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఈకేవైసీతోనే ఈ ఏడాది పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సిబ్బందిని పూర్తిస్థాయిలో రైతులందరికీ ఈకేవైసీ చేసేవిధంగా అప్రమత్తం చేశాం. జిల్లాలో సుమారు 95 నుంచి 97శాతం ఈకేవైసీ పూర్తయ్యింది. మిగిలిన రైతులందరితో ఈకేవైసీ పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి బయోమెట్రిక్ అవసరం లేదు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

తల్లుల ఆనందం...

- పిల్లలకు పుస్తకాలు, బ్యాగుల కొనుగోలు
- కిటకిటలాడిన పోస్టాఫీసు



పోస్టాఫీసులో తల్లికి వందనం డబ్బులు తీసుకుంటున్న మహిళలు

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం ప్రకారం తల్లుల ఖాతాల్లో నగదును జమ చేసింది. ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లులు బ్యాంకు ఖాతాలో, పోస్టాఫీసు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేసింది. సోమవారం ప్రధాన తపాలా కార్యాలయంలో తమ ఖాతాల్లో జమ అయిన నగదును డ్రా చేసుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. దీంతో పోస్టాఫీసు సిబ్బందికి వారిని నియంత్రించేందుకు శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆనందంగా నగదు డ్రా చేసుకొని పోస్టాఫీసు సమీపంలోని దుకాణాలలో తమ పిల్లలకు పుస్తకాలు, బ్యాగులను కొనుగోలు చేశారు.



కర్నూలులో పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు



బడి ఘోష

● నన్ను కాపాడండి.. ● విద్యార్థులు లేక, శిథిలమైపోతున్న పాఠశాల ఆవేదన ● కరపత్రం విడుదల చేసిన ఉపాధ్యాయులు



ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాల



కరపత్రం విడుదల చేసిన పాఠశాల ఉపాధ్యాయులు

మద్దికెర, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగిన బడి, వందలాది పిల్లలతో కళకళలాడిన విద్యాలయం, నేడు బోసిపో యింది. ప్రైవేట్ పాఠశాలల మోజులో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చకపోవడంతో ఈ పాఠశాల వెలవెలపోతోంది.. ఈ దుస్థితిని ఉపాధ్యా యులు బడి ఘోషగా కరపత్రంగా విడుదల చేశారు. అది ఇలా ఉంది...

గౌరవనీయ గ్రామ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు నా విన్నపం. నాడు ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి ఎదిగేలా చేయూతనిచ్చాను. గతంలో నన్ను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఎంతో బాగా చూసుకున్నారు. ఊరికి అతిదగ్గరలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన గదులు. పచ్చని చెట్లు, ప్రహరీ, బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన ఉండేది. క్రమంగా నన్ను వదిలేసి మీ పిల్లలను మద్దికెర, గుంతకల్లు షూటూ, బూటూ టై కట్టి అరకొర వసతులు గల ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతోంటే నా గుండె బరువెక్కింది. ఆ పిల్లలు అట్లా పోతుంటే చూస్తూ శిలనైపోయాను. నా బిడ్డలు నా దగ్గరకు రాకుండా పోతున్నారనే బాధ.. కానీ ఏమీ చేయలేని దౌర్భాగ్యస్థితి నాది. నేను ఎందరో డాక్టర్లను ఇచ్చాను.. ఇంజనీర్లను ఇచ్చాను.. న్యాయవాదులను కూడా ఇచ్చాను.. ఉపాధ్యాయులను ఇచ్చాను.. ఉపాధ్యాయులు వస్తుంటారు.. బదిలీపై వెళ్తుంటారు.. నన్ను కాపాడుకోవాలని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేటట్లు చూసుకోవాలనే ఆలోచన ఎవరైనా చేస్తున్నారా..? కొన్నేళ్ల తర్వాత నేను కూడా మొండి గోడలతోనే నిలబడిపోతానేమో అనే భయం కలుగుతున్నది. ఇప్పటికైనా మీ బిడ్డలను నా చెంతకు పంపండి.. వారి భవితను తీర్చిదిద్దుతాం. ఆనాటిలాగే నేడూ విద్యార్థులతో కళకళలాడేలా నన్ను చూడాలని కోరుతున్నాను..

గ్రామ ప్రజలందరికీ రెండు చేతులా నమస్కరిస్తున్నాను.. నన్ను కాపాడుకోండి... నేను మీ గ్రామ చదువుల బడిని.. ధన్యవాదాలతో ..

ఇట్లు..

మీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఎం.అగ్రహారం, మద్దికెర మండలం.

ఆర్టీసీలో 'సౌర' వెలుగులు

- సోలార్ వినియోగంతో నెలకు రూ. లక్ష ఆదాయం
- అన్ని డిపోలకు ఆదర్శం నంద్యాల
- రాష్ట్రంలోని ఐదు డిపోల్లో ఏర్పాటు



నంద్యాల ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకలు

నంద్యాల టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ఆర్టీసీ డిపో అధికారులు సోలార్ విద్యుత్తు వైపు అడుగులు వేశారు. దీంతో నెలకు రూ. లక్ష వరకు నష్టాన్ని తగ్గించుకున్నారు. ఇప్పటికి కొన్ని ఏళ్ల నుంచి సోలార్ విద్యుత్ వాడుతూ ఏడాదికి సుమారుగా రూ.12 లక్షల ఆదాయం చేకూరుస్తున్నారు. రాష్ట్రంలోనే నంద్యాల ఆర్టీసీ డిపో ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా 2019లో ఈ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించారు. నంద్యాల డిపోతో పాటు కాకినాడ, విజయవాడ, మదనపల్లి, చిత్తూరు జిల్లాల్లోని డిపోల్లో సౌర విద్యుత్‌ను ఏర్పాటుచేశారు. ఇందుకు సావిటర్ సంస్థ వారు ఆర్టీసీ డిపోల్లో ఏర్పాటు చేయించారు. ఇందుకు అయ్యే ఖర్చు సుమారుగా రూ.35 లక్షలైంది. సంస్థ వారు 50శాతం పూర్తిగా సబ్సిడీ ఇచ్చారు. రెండేళ్ల పాటు వారే నిర్వహణ బాధ్యత కూడా తీసుకున్నారు. 2019నుంచి ఇప్పటివరకు ఆర్టీసీ వారు సౌర విద్యుత్తు వాడడం వల్ల ఇప్పటి వరకు సుమారుగా రూ.70లక్షల వరకు మిగిల్చినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అలాగే సౌర విద్యుత్తు వల్ల ఉత్పత్తి అయిన విద్యుత్తును మిలిగిన వాటిని విద్యుత్తు శాఖ వారికి ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

రోజుకు 400 నుంచి 500 యూనిట్ల వరకు..

నంద్యాల ఆర్టీసీ డిపోలో నెలకు గతంలో కరెంటు బిల్లులు రూ. 2లక్షలు వచ్చేవని అధికారులు చెబుతున్నారు. ఈ భారం భరించలేక సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేశారు. దీంతో రోజుకు 400 యూనిట్ల నుంచి 500 యూనిట్ల వరకు కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. చిత్తూరు, విజయవాడ, మదనపల్లి, కాకినాడ డిపోల్లో కూడా రోజుకు 300 నుంచి 600 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. డిపోల్లో వినియోగం పోగా మిగిలిన విద్యుత్ విద్యుత్ శాఖ వారు కొనుగోలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వారు కోనుగోలు చేస్తున్నందుకు తగిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లిస్తున్నారు.

ఇతర డిపోల్లో ఏర్పాటుకు ప్రణాళికలు

నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూర్, కోవెలకుంట్ల, బనగానపల్లె, బేతంచెర్ల డోన్ వంటి ప్రాంతాల్లో కూడా సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా కొనసాగితే చాలావరకు విద్యుత్‌ను ఆదా చేసినట్లు అవుతుంది. ఆర్టీసీ ప్రాంగణంలో కరెంటు కోతలు ఉండవు. సంస్థకు ఆదాయం కూడా సమకూరుతుంది.

సిబ్బందికి ఉపయోగకరం..



ఆర్టీసీలో ఇప్పటివరకు సోలార్ ద్వారా విద్యుత్‌ను ఆదాచేశాం. విద్యుత్ కోతలు లేకుండా గ్యారేజిలో పనులు చేస్తున్నాం. దీంతో సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. అత్యవసర సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది. ఇలానే జిల్లాలోని అన్ని డిపోల్లో ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నాం.

● రజియా సుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, నంద్యాల

దిగజారుడు రాజకీయాలు చేస్తున్న వైసీపీ

• డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అకెపోగు ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. వైసీపీ నాయకుడు ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు కొందరు నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబును వెన్ను పోటు దారుడంటూ విమర్శించడం.. వారికి స్థాయికి తగదన్నారు. ఏనాడు జిల్లాల అభివృద్ధి గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక పోతున్నారని మండి పడ్డారు. జగన్ ఏనాడు ప్రజల గురించి పట్టించుకోలేదని, ఎంత సేపు మైనింగ్, లిక్కర్, ఇసుక, గంజాయి, డ్రగ్స్ వంటి మాఫియాలతో రాష్ట్రాన్ని దోచేసి, ప్రజల నెత్తిన పది లక్షల కోట్ల అప్పు పెట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి.జేమ్స్, నంద్యాల నాగేంద్ర, నాయకులు జె.తిరుపాల్ బాబు, సత్రం రామక్రిష్ణ, విజయకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

• ప్రమాణ స్వీకారం విజయవంతం.. నంద్యాలో డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు వై.నాగేశ్వర రావు కృతజ్ఞతలు తెలిపారు.

19న అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉదయం 10 గంటలకు డీఎస్‌ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2009 తరువాత 31.8.2011కు ముందు జన్మించిన వారు అండర్ 14 బాలుర జట్టు ఎంపికకు అర్హులన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో ఎంపికకు హాజరు కావాలన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నందవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నందవరం గ్రామానికి చెందిన పొతుగడ్డ పులకుర్తి రాముడు అప్పులబాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ కేశవ్ తెలిపారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. వెంటనే చుట్టు పక్కల వారు గ్రహించి ఆయనను ఎమ్మిగనూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రాముడు భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడు రైతు మృతికి నివాళి అర్పించారు.



రాముడు (ఫైల్)

వృద్ధుడి మృతి

పగిడ్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో పాలమర్రికి చెందిన నాగశేషులు(68) అనే వృద్ధుడు సోమవారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ సుబ్బరావు తెలిపారు. పాలమర్రికి చెందిన నాగశేషులు 30 ఏళ్లకు పైగా గడివేములలోని హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో ఎవరూ లేనప్పటికీ ఏడాది ఒకసారి ఇక్కడికి వచ్చి వెళ్తుండేవాడని తెలిపారు. గత రెండు రోజుల కిందట గ్రామానికి వచ్చిన నాగశేషులు బస్టాండ్‌లో ఉన్నాడు. ప్రమాదవశాత్తు రాత్రి కింద పడటంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామంలో విచారించి బంధువులకు సమాచారం తెలియజేశారు.

ఈతకు వెళ్లి బాలుడు..

నంద్యాల టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక నగర్ చెందిన బాలుడు మహేశ్ (17) ఈతకు వెళ్లి మృతి చెందినట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వివరాల మేరకు.. ఉశేనమ్మ, బోయ నాగరాజు దంపతుల కుమారుడు మహేశ్ స్నేహితులతో కలిసి చాపిరేవుల వద్ద ఉన్న బావికి ఈతకు వెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో బావిలో మునిగి మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి...

కర్నూలు క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాలపాడు వంతెన వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని రామకృష్ణారెడ్డి (56) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పాలకూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి కర్నూలు సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం బైక్‌పై ఊరికి వెళ్తుండగా.. బ్రిడ్జి పై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య కొడుకు, కూతురు ఉన్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడి.. బాలుడికి గాయాలు

బేతంచెర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీ సోమవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన రాజేష్, మౌనిక దంపతుల రెండేళ్ల కుమారుడు ప్రణీత్ ఇంటి ముందు ఆడుకుంటుండగా.. నాలుగు కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాలుడి అరుపులు విన్న కాలనీ వాసులు కుక్కల్ని తరిమి బాలుడి ప్రాణాలు కాపాడారు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు భార్గవ్ యన్నా కాలనీకి చేరుకుని బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం బోయపేటలో ఆరేళ్ల పాపను కుక్కలు దాడి చేసి గాయపరిచాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి పిల్లల ప్రాణాలను కాపాడాలని కోరారు.

వాహనం దగ్ధం

వెల్దుర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లోని ఇండెన్‌గ్యాస్ ఆఫీసు వెనుక ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో వాహనం దగ్ధమైంది. వివకాల మేరకు అక్కడున్న పాత పాతటైర్లు అంటుకోవడంతో వాహనానికి మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. గమనించిన కాలనీవాసులు డీన్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు చేరుకొని మంటలను అదుపుచేశారు. కాగా వాహనం క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది, గ్యాస్ ఏజెన్సీ ఉన్న ఇంటికి పైపులు పూర్తిగా దెబ్బతిని, గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. రూ.5లక్షలు ఆస్తినష్టం సంభవించిందని ఐచర్ యజమాని మధు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పూర్తిగా కాలిపోయిన వాహనం

బియ్యం దొంగలు ఎవరు..?

• ఆదోని శివారులోని ప్రైవేట్ గోదాములో గుర్తించిన బియ్యం చుట్టూ సందేహాలు

• నందికొట్కూరు ఎంఎల్‌ఎస్ పాయింట్‌లోని 94 బస్తాల బియ్యం ఏమయ్యాయి..?



బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్



మిగిలిన బియ్యాన్ని చూపుతున్న డిప్యూటీ తహసీల్దార్ బాబు, ఆర్ఐ ఖాశీం

కర్నూలు/ఆదోని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని శివారులో శుక్రవారం అర్ధరాత్రి తూకాలు వేసి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఓ ప్రైవేటు గోదాములో ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు తనిఖీ చేశారు. సుమారుగా 1,500-1,800 బస్తాలు పేదల ఆకలి తీర్చే బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు సమాచారం ఇచ్చారు. గోదాముకు కల్లుబావి వీఆర్‌ఓ రాజశేఖర్‌గౌడ్ వేసిన తాళం శనివారం ఉదయం తెరిస్తే బియ్యం బస్తాలు కనిపించలేదు. ఇది ఎలా సాధ్యం..? బియ్యం దొంగలు ఎవరు..? కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నుంచి బీజేపీలో చేరిన ఓ యువనేత ఓ పోలీస్ అధికారితో కలసి రేషన్ బియ్యం మాఫియా నడిపారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మూఠానే మాయం చేసిందా..? అనే ప్రశ్నలు ఎన్నో రేకెత్తాయి.

ఆదోని అడ్డాగా జరుగుతున్న బియ్యం దందా ఈ నాటికి కాదు. వైసీపీ ప్రభుత్వం రాక ముందు వరకు పలువురు వ్యాపారులు రేషన్ బియ్యం సేకరించి రహస్యంగా సరిహద్దులు దాటించి కర్ణాటకకు చేర్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాజకీయ అండతో 'బియ్యం మాఫియా' ఏర్పడటంతో భారీ దందా మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో 'చిన్న బాస్'గా పేరుగాంచిన వైసీపీ యువ నాయకుడి నేతృత్వంతో బియ్యం మాఫియా పెట్రేగిపోయింది. ప్రతి నెల 25-35 లారీలు (ఒక్కో లారీ 18-20 టన్నులు) బియ్యం అక్రమంగా ఏపీ సరిహద్దులు దాటించేవారనే ఆరోపణలు ఉండేవి. ఆ యువనాయకుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. వైసీపీని వీడి బీజేపీలో చేరారు. పార్టీ మారినందుకు ప్రతిఫలంగా ఆ యువ నాయకుడికి బియ్యం అక్రమ రవాణా అప్పగించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈయనకు ఓ పోలీస్ అధికారి కూడా అండగా నిలిచారని సమాచారం. వైసీపీ నుంచి వచ్చిన యువ నాయకుడిని కాదని రెండు నెలల క్రితం అధికార పార్టీకి చెందిన మరో వర్గం రేషన్ బియ్యం మాఫియాగా మారిందనే చర్చ కూడా ఉంది. కొత్తగా బియ్యం అక్రమ రవాణాలోకి దిగిన వ్యక్తులు వివిధ మార్గాల్లో సేకరించిన రేషన్ బియ్యం రవాణాకు సిద్ధం చేయగా.. పక్కాగా సమాచారంతో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు దాడులు చేసినట్లు తెలుస్తోంది.

బియ్యం మాయం వెనుక పాత్ర ఎవరిది?

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు వెళ్లిన కల్లుబావి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌ఓ) రాజశేఖర్‌గౌడ్ సమక్షంలో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు బియ్యం అక్రమంగా నిల్వ చేసిన గోదాముకు తాళం వేశారు. ఆ తాళం చెవి వీఆర్‌వో వద్దే ఉంచినట్లు తెలుస్తోంది. తాళం వేసిన గోదాములో సుమారు 750-900 క్వింటాళ్ల బియ్యం ఉంటాయని అంచనా. సివిల్ సప్లయ్ శాఖ లెక్కల ప్రకారం వాటి విలువ సుమారుగా రూ.35 లక్షలు పైమాటే అని అధికారులే అంటున్నారు. ఇంత విలువైన బియ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. కానీ రాత్రికిరాత్రే బియ్యం మాయం కావడం చర్చనీయాంశమైంది. బియ్యం నిల్వలు ఉన్న వీడియోలు రాత్రే సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు చేరాయి. ఆయన తక్షణమే స్పందించి పోలీసుల రక్షణ కల్పించి ఉంటే బియ్యం మాయం అయ్యేవి కాదుకదా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వేసిన తాళం వేసినట్లే ఉంది.. బియ్యం మాత్రం కనిపించడం లేదు. ఇవి అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలిపోయాయి.

ఆ బియ్యం ఎలా వచ్చాయి..?

నందికొట్కూరు సివిల్ సప్లయ్ మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ గోదాములో వివిధ దాడుల్లో పట్టుబడిన 984 బస్తాల(492 క్వింటాళ్లు) రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు వాటిని బహిరంగ వేలాం ద్వారా విక్రయించి వచ్చిన నగదును ట్రెజరీలో జమ చేయాలి. అయితే.. 15 రోజుల క్రితం ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు ఆ గోదాము తనిఖీ చేశారు. ఆ సమయంలో రికార్డుల్లో ఉన్న పట్టుబడి రేషన్ బియ్యం 984 బస్తాలు గోదాములో మాయం అయినట్లు గుర్తించారు. గోదాము ఇన్‌చార్జిగా ఉన్న అధికారే మాయం చేశారా..? అనే ప్రశ్న తలెత్తింది. ఇటీవల బదిలీల్లో భాగంగా గోదాము ఇన్‌చార్జి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వచ్చిన డీటీ మాయమైన సీజ్ చేసిన బియ్యం లెక్కలు చెబితే తప్ప బాధ్యతలు తీసుకోలేనని తెగేసి చెప్పినట్లు సమాచారం. మాయమైన రేషన్ బియ్యం ఎంఎల్ఎస్ గోదాములో కనిపించాయి. వీటి చుట్టూ ఉన్న ప్రశ్నలపై సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న డీటీ శివరాం

కల్లూరు. జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని సోమిశెట్టినగర్-2లో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ప్యాకెట్ల పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు శివరాం పట్టుకున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడి చేసిన అధికారులు షాప్ నెంబరు 144 నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసు కున్న టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటీ శివరాం పంచనామా నిర్వహించి షాప్ నిర్వాహకులపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సచివాలయ వీఆర్వో మహమ్మద్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో నేటి నుంచి బదిలీలు

• ఉమ్మడి జిల్లాలో 135 మంది జాబితా సిద్ధం

• కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ



కర్నూలు హస్పిటల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా క్యాడర్ల ఉద్యోగులకు సాధారణ బదిలీలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలోని 18 క్యాడర్లకు సంబంధించిన 135 మంది ఉద్యోగులను బదిలీ చేసేందుకు జాబితాలను సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్లు, ఎంపీహెచ్‌ఏ (ఎం)లు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)లకు, 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డీ కంప్యూటర్ ఆఫీస్ సబార్డినేట్‌లు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, క్లీనర్, వాచ్‌మెన్, తోటి హెల్పర్, స్వీపర్, ఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూ (ఎం) స్ట్రెచ్చర్ బేరర్, ఫీమెల్ అటెండర్, ఎక్స్‌రే అటెండెంట్, ల్యాబ్ అటెండెంట్‌లకు బదిలీలు జరుగుతాయన్నారు. బదిలీల కౌన్సిలింగ్ పీహెచ్‌సీల్లోనే జూమ్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా పీహెచ్‌సీ లోనే ఉండి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

డీసీసీబీని అభివృద్ధి చేయండి

• సింధూర్ పథకంతో అధిక వడ్డీ • చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



సింధూర్ డిపాజిట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకులతో సమానంగా రైతులకు, మహిళలకు అన్ని వర్గాల వారికి ఆర్థిక ప్రోత్సాహన్ని అందిస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి చేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి 333 రోజుల వ్యవధికి సంబంధించిన సింధూర్ అను నూతన డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. డిపాజిట్‌దారులకు ఎంతో ప్రయోజనాన్ని అందించే ఈ డిపాజిట్ స్కీంను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇతర అన్ని బ్యాంకులకన్నా అత్యధికవడ్డీ పొందే అవకాశం ఉందన్నారు. సీఈవో రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్‌లో దుకాణాలు

• పార్కింగ్ స్థలంలో షాపులతో ట్రాఫిక్ సమస్యలు • అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో అధికారుల ఆదేశాలు బేఖాతరు



సెల్లార్‌లోని దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని బీ అండ్ ఈ బ్లాక్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో దుకాణాలు నిర్మించారు. బ్లాక్‌ల ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో నగరపాలక అధికారులు నోటీసు లు జారీ చేసినా ఫలితం కనిపించలేదు. సుమారు 25 సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి. ఇటీవల పెరిగిన నగర జనాభా వల్ల సమస్య తీవ్రమైంది. ప్రతి రోజు అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోకి సుమారు 200 నుంచి 300 వంద వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటి మధ్య నుంచి పాదచారులు అటు వెపు వెళ్లడం కష్టంగా ఉంది. ఇక్కడ పార్కింగ్ లేకపోవడంతో ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ ఆవరణలో వాహనాలను నిలుపుకొని వెళ్తున్నారు.



సెల్లార్‌లో ఏర్పాటు చేసిన దుకాణం

ధనార్జనే ధ్యేయంగా సెల్లార్‌లో దుకాణాలు..

అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ యజమాని ధనార్జనే ధ్యేయంగా సెల్లార్‌లో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్మించారు. సెల్లార్‌లో పార్కింగ్ కోసం స్థలం కేటాయించకుండా 100 దుకాణాలను నిర్మించి అద్దె వసూలు చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.10 నుంచి రూ.15, రూ.20, రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన యజమానికి ప్రతి నెల ఎంతలేదన్నా రూ.12,50,000 వరకు ఆదాయం వస్తున్నది.

యజమానికి 1955 సెక్షన్ 636 ప్రకారం నోటీసు జారీ

స్థల యజమానికి భవనాల నిర్మాణానికి మంజూరు చేసిన ప్లాన్‌కు విరుద్ధంగా వాహనాల పార్కింగ్ కోసం ఉపయోగించాల్సిన సెల్లార్‌లో దుకాణాలు, గోడౌన్‌లు నిర్మించడంతో నగర పాలక సంస్థ చట్టం 1955 సెక్షన్లు 441,443,452,461,462, 636 ప్రకారం 2018 మేలో నోటీసులు జారీ అయ్యాయి. అంతే కాకుండా 2006 అక్టోబర్ 28న ఏపీ హైకోర్టు .డబ్ల్యూపి.నెంబరు 15591/2006 సుమోటాగా స్వీకరించింది. సెల్లార్ స్థలంలో కట్టడాలను సొంత ఖర్చుతో తొలగించాలని ఆదేశించింది. ప్రభుత్వ పురపాలక పరిపాలనా విభాగం నుంచి మెమోనెంబరు 20471/బి4/2006 తేది. 6.4.2007లో కూడా యజమానికి మెమో జారీ చేశారు. అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ యజమాని ఉత్తర్వులు పాటించకుంటే సెక్షన్ 636 హెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం సెల్లార్‌లోని కట్టడాలను నగర పాలక సంస్థ తొలగించాలని, దానికి అయ్యే ఖర్చు కూడా వసూలు చేయాలని, అరెస్టు చేయవచ్చని పేర్కొంది.

యజమానికి కమిషనర్‌కు లేఖ

1955 చట్టం ప్రకారం నోటీసులు రావడంతో స్థల యజమాని నగర పాలక కమిషనర్‌కు 08.08.2028న లేఖ రాసాడు. నిబం ధనల ప్రకారమే 12 సెంట్లలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తానని, దుకాణాలను తొలగిస్తానని, సిసి కెమెరాలు, పార్కింగ్‌లో లైటింగ్, పెయింటింగ్‌తో పాటు సెక్యూరిటీ ఏర్పాటుకు అంగీకరిస్తు న్నట్లు అందులో ఉంది. ఇప్పటికి ఏడేళ్లు దాటింది. యజమాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత నాలుగు నెలల నుంచి నగర పాలక కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో సెల్లార్‌లో దుకాణాల వల్ల తలెత్తుతున్న ట్రాపిక్ సమస్యపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు సంబంధిత యజమానికి మరోసారి నోటీసులు జారీ చేశారు.

దుకాణాలు తొలగించాలని గుర్తుచేశాం



2018 సంవత్సరంలో స్థల యజమానికి సెల్లార్‌లో దుకాణాలు తొలగించాలని కోర్టు ఉత్తర్వులతో పాటు నోటీసులు జారీ చేశాము. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. మరోసారి గుర్తు చేశాం. యజమానికి స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. **- ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్, నగర పాలక సంస్థ**

భరోసా కల్పించేందుకే కార్డన్ సెర్చ్

పాములపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే మండలంలోని గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు. సోమవారం మండలంలోని వాణాల గ్రామంలో తెల్లవారుజామున నేర నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కార్డన్ సెర్చ్ నిర్వహించమన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ 29 క్వార్టర్ల అక్రమ మద్యం సీసాలు, సరైన ధృవపత్రాలు లేని 9 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.. కార్యక్రమంలో పోలీసులు రమణ, ఖాజ, యాగంటి తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పాములపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానమంత్రి మోదీతో దేశాభివృద్ధి సాధ్యమని పాములపాడు మండల బీజేపీ అధ్యక్షుడు మురళీమోహన్, రాష్ట్ర కౌన్సిలు సభ్యులు చల్లా దామోదరరెడ్డి అన్నారు. సోమవారం పాములపాడులో మోదీ సుపరిపాలన 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ ప్రజలకు అందించిన, అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రానికి కేంద్రం వివిధ రకాల ప్రాజెక్టులకు సహకారం అందిస్తుందన్నారు. కారక్రమంలో బిజెపి నాయకులు గోపాలయ్య, చంద్రశేఖరరెడ్డి, నాగలింగమయ్య, బాలస్వామి, ఆరోగ్యస్వామి, కార్యకర్తలు అభిమానుల

పార్టీ బలోపేతానికి కృషి



టీడీపీ అబ్జర్వర్‌గా ఎన్నికైన చెల్లె హరినాథరెడ్డి

పాములపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నాయకుడు చెల్లె హరానాథరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎర్రగూడూరులో మాట్లాడుతూ తనకు మహానంది మండలం టీడీపీ అబ్జర్వర్‌గా నియమించినందుకు అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



పుస్తకాలు విద్యార్థులకు అందజేస్తున్న కౌన్సిలర్

నందికొట్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బైరెడ్డి నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డా. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహబూబ్‌బీ, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కొళాయి వద్ద ఖాళీ బిందెలను చూపుతున్న మహిళలు, సీపీఎం నాయకులు

నందికొట్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఆర్.నగర్ లోని కొట్టాల్లో నీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు మున్సిపాల్టీ కర్నూలు రోడ్డు బి.ఆర్.నగర్ సీపీఎం కొట్టాల్లో సీపీఎం నాయకులు గోపాలకృష్ణతో కలిసి పర్యటించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలు నివాసం ఉంటున్నారని ఈకాలనీలో సరైన మౌలిక వసతులు లేక ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కాలనీలో ఒక పైప్‌లైన్ వేయడం వల్ల నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కోసం గంటల తరబడి కొళాయిల దగ్గర వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు చెబుతున్నారన్నారు. కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, పక్కీరయ్య, జీవమ్మ, కర్ణమ్మ, లక్ష్మీదేవి, నాగమ్మ, రామాంజనేయులు, స్వాములమ్మ, అంజమ్మ, బాబి పాల్గొన్నారు.

భవన నిర్మాణ బోర్డును పటిష్టపరచాలి



లేబర్ అధికారులకు వినతి అందజేస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ బోర్డును పటిష్ట పరచాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక లేబర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం చట్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2018 వరకు బోర్డులో చేరిన వారికి ప్రమాద బీమ, మరణ ప్రయోజనాలు, వంటి వి ఏవీ అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులను అదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగనాయకులు, మహ్మద్, సులోచన పాల్గొన్నారు.

సాంకేతిక పరిణామాలు అధ్యాపకులకు అనుకూలం

పాణ్యం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యావిధానం, సాంకేతిక పరిణామాలు అధ్యాపకులకు అనుకూలంగా ఉన్నాయని యూజీసీ హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్, రాయలసీమ యూనివర్శిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ నరసింహులు పేర్కొన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆర్జీఎం సీఎస్ (డేటాసైన్స్), ఈఈఈ విభాగాలు, ఎస్ఐఈపీఏ, న్యూఢిల్లీ సహకారంతో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 అండ్ ఎడ్యుకేషన్ 4.0 అంశంపై సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సు 21వ తేదీ వరకు జరుగుతుందన్నారు నూతన విద్యా విధానం, సాంకేతిక ఆధారిత విద్యాపరిణామాలను, విద్యా సంస్థల అభివృద్ధిలో భాగస్వామ్యం చేసుకోవడానికి విద్యావేత్తలకు, అధ్యాపకులకు, పరిశోధనలకు ఎడ్యుకేషన్ 4.0 అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఈపీఏ ఐసీటీ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ హెచ్ఓడి ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డీన్ డాక్టర్ రామిరెడ్డి, కోఆర్డినేటర్ విజయ సురేష్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు అధ్యాపకులు పాల్గొన్నారు.

కమ్ముకున్న కరువు మేఘం!



ఎన్నో ఆశలతో మొదలైన ఖరీఫ్ సీజన్.. గాలులతో ముంచెత్తుతోంది. అడపాదడపా కురిసినా వర్షాలకు కొందరు రైతులు విత్తనాలు విత్తారు. మరి కొందరు దుక్కి దున్ని, విత్తనాలను, ఎరువులను సిద్ధం చేసుకున్నారు. వరుణుడు గత 15 రోజుల నుంచి రానంటోంది. రోజూ చినుకుల కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. అదును దాటిపోతుందోమోనని ఆందోళన చెందుతున్నారు.

- రుతు పవనాల దోబూచులాటతో సందిగ్ధంలో రైతన్న
- ఆత్మకూరు డివిజన్‌లో ఆరుతడి పంటపైనే ఆసక్తి
- రిజర్వాయర్లకు నీటి చేరిక మొదలైతేనే వరినాట్లు



ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. మే నెలలోనే సమృద్ధిగా వర్షాలు కురియడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని రైతన్నలు భావించారు. అయితే జూన్‌లో వరుణుడు ముఖం చాటేడయంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. జూన్ వచ్చి 16 రోజులైనా పదునైన వర్షాలు కురవలేదు. ఈ ఏడాది ఆత్మకూరు డివిజన్ లో అత్యధికంగా 31432 హెక్టార్లలో సాగు విస్తీర్ణం నమోదు కానుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇందులో కొత్తపల్లి మండలంలో 9142 హెక్టార్లు, ఆత్మకూరు మండలంలో 7784 హెక్టార్లు, పాములపాడులో 9013 హెక్టార్లు, వెలుగోడు మండలంలో 5493 హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది.



పత్తి విత్తనాలు

ఆరుతడి పంటలపైనే రైతుల ఆసక్తి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంటపైనే రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 31,432 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా అందులో అత్యధికంగా మొక్కజొన్న 18483 హెక్టార్లలో సాగు కానుంది. అదేవిధంగా వరి 6937 హెక్టార్లు, పత్తి 2496 హెక్టార్లు, సోయాబీన్ 1048 హెక్టార్లు, ర్రి 926 హెక్టార్లు, మిమినుము 590 హెక్టార్లు, కంది 310 హెక్టార్లు, కూరగాయలు 271 హెక్టార్లు, పసుపు 85 హెక్టార్లతో పాటు మిగిలిన 286 హెక్టార్లలో ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉంది. అయితే గత ఏడాది డివిజన్ పరిధిలో పొగాకు పంటను విస్తారంగా సాగుచేసినప్పటికీ గిట్టుబాటు ధర లేకపోవడంతో పొగాకు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

మేలో డివిజన్‌లో విస్తారంగా వర్షాలు

ఈ ఏడాది మే నెలలో ఆత్మకూరు డివిజన్‌లో మాత్రం విస్తారంగా వర్షాలు కురిశాయి. మే నెలకు సంబంధించి 31.52 మిమీల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 96.9 మిమీల వర్షపాతం నమోదైంది. ఇందులో అత్యధికంగా కొత్తపల్లి మండలంలో 112మిమీల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా వెలుగోడు మండలంలో 61మిమీల వర్షపాతం కురిసింది. అయితే జూన్‌లో మాత్రం చినుకు జాడలేకుండాపోయింది. దీంతో ఎక్కడ అదును దాటుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు అప్పులు చేసి విత్తనాలు తెచ్చిపెట్టుకున్నారు. రెండు మూడు రోజుల్లో వర్షాలు కురకపోతే బోరుబావుల కింద సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేలో కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	సాధారణం	కురిసింది
ఆత్మకూరు	26.5 మిమీ	111.8 మిమీ
వెలుగోడు	32.8 మిమీ	102.8 మిమీ
కొత్తపల్లి	28.2 మిమీ	112 మిమీ
పాములపాడు	38.1 మిమీ	61 మిమీ
సగటు వర్షపాతం	31.52 మిమీ	96.9 మిమీ

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



వర్షాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు రుతుపవనాల ప్రభావంలో మరో రెండు,మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

\- అంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

తల్లికి వందనంతో ఆనందం



చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, విద్యార్థులు

పగిడ్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థికి వరంలాంటిదని, ఎంత మంది ఇంట్లో చదువుకుంటే వారందరికీ పథకం కింద డబ్బులు జమ చేశామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పగిడ్యాల, పాలమర్రి, సంకిరేణిపల్లె గ్రామాల్లో తల్లికి వందనం పథకం కింద ఒకే కుటుంబంలో ముగ్గురికి సొమ్ము అందడంతో కొంత మంది బాధితులను సోమవారం కలిసి ఆయన మాట్లాడారు. పగిడ్యాలకు చెందిన ప్రతాప్, లావణ్యల ముగ్గురు పిల్లలు, సంకిరేణిపల్లె గ్రామానికి చెందిన ఎల్లయ్య, ఎల్లమ్మల నలుగురి పిల్లలకు సొమ్ము జమ కావడంతో ఎమ్మెల్యే తో కలిసి సీఎం చంద్రబాబునాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యేకు థ్యాంక్స్ తెలియజేశారు. అనతరం విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, పుల్యాల రాజశేఖర్‌రెడ్డి, వాసురెడ్డి, విజయ్, నరసింహ, బాబు, ఎల్లయ్య, శ్రీను, ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, ఎంఈవో సుబాన్ ఉన్నారు.

- పగిడ్యాల దేవనగర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారా? ఈ రోజు మెను ఎమిటి అని ప్రధానోపాధ్యాయడు కన్నయ్యబాబును అడిగి తెలుసుకున్నారు. మెనూ చార్టు లేకపోవడంతో ఆయనపై ఎమ్మెల్యే మండిపడ్డారు. అనతరం విద్యార్థులకు ఉడికి ఉడకని అన్నం, నీళ్ల చారు వండటంతో వంట ఏజెన్సీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇలాంటి భోజనమే తిటారా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. మరోసారి ఇలా చేసే సహించేది లేదని హెచ్చరించారు.
- పగిడ్యాలకు చెందిన లక్ష్మీ అనే మహిళకు సీఎం రీలిఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 2లక్షల చెక్కును ఎమ్మెల్యే బాధితురాలికి అందజేశారు. ఆనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సీఎం సహాయ నిధి కింద వైద్య ఖర్చులకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, వాసురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

మహానంది: మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన షేక్షావలీ, సల్మా దంపతులకు నలుగురు సంతానం, అందరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తల్లికివందనం పథకంలో తమ చిన్నారులు ఆయిషఆష్మా,విహాన్, షాహీన్‌లకు తల్లి బ్యాంక్ అకౌంట్‌లో ఒకొక్కరికి రూ.13 వేల ప్రకారం రూ. 52 వేలు జమ అయినట్లు చెప్పారు. సోమవారం గ్రామ టీడీపీ నాయకుడు కిలార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు, తల్లితండ్రులు సంబరాలు జరుపుకున్నారు.


రైతులకు అవగాహన కల్పించాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

మహానంది, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించి, వారిని అభివృద్ధి పర్చేందుకు కృషి చేయాలని మహానంది ఉద్యానవన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తడాక్టర్ ఠాగూర్‌నాయక్ సూచించారు. సోమవారం మహానంది మండలం గోపవరంలో వైఎస్ఆర్ జిల్లా అనంతరాజ్ పేటకు చెందిన ఉద్యానవన కళాశాల నాలుగో సంవత్సరం చదివే విద్యార్థులు రావే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఉద్యానవన శాస్త్రవేత్తలు కిషోర్ కుమార్, సీహెచ్ రూత్, దీప్తి, బిహరిప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులు ఉద్యానవన పంటల సాగుపై రూపొందించిన పుస్తకాన్ని శాస్త్రవేత్తలతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంద్యాల ఉద్యానవనశాఖాధికారి హరీంద్ర, రైతులు మాధవరామిరెడ్డి, కృష్ణారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతం కోసం పార్టీ అభివృద్ధి కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం వేల్పనూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో శ్రీశైలం నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల నిర్వహణపై ఆయా మండలాల పరిశీలకులు, మండల పార్టీ అధ్యక్షులతో పార్టీ ప్రధాన కార్యదర్శులతో, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పలు సూచనలు చేశారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. అబ్జర్వర్లు, ఆయా మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టరు, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్‌కు కొత్త ఇన్‌చార్జి

నందికొట్కూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీగా డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. చాలా కాలంపాటు గోదాము ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వమించిన నారాయణమ్మ ఎట్టకేలకు బదిలీ అయ్యారు. గతంలో ఎన్నిసార్లు బదిలీలు వచ్చినా ఈమె ఇక్కడనే తిప్పవేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవలే నందికొట్కూరు ఎంఎల్ఎస్ గోదామును రాష్ట్ర సివిల్‌స్సై కార్పొరేషన్ డైరెక్టర్లు మహేష్‌నాయుడు, లక్ష్మీనారాయణలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల అనంతరం ఆమె బదిలీపై వెళ్లడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పల్లకిలో పార్వతీ పరమేశ్వరులు

మహానంది, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకి సేవ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో స్వామి,అమ్మవార్లను వేదపండితులు భక్తి శ్రద్ధలతో పల్లకిలో ఆశీనులు గావించారు. వేదమంత్రాలతో పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకిసేవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, అర్చకులు మామిళ్ళపల్లి రాఘవశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయండి

ఆత్మకూరురూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టి జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎంసీపిఐయు జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండలంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున ఆధ్వర్యంలో నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిరుపేదలకు రెండు సెంట్లు మంజూరు చేసి రూ 5 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులుసోమన్న, నరసింహులు,ఎంసీపిఐయు నాయకులు మర్రి స్వామి, శ్రీనివాసులు, వెంకటరమణ శేఖర్ పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలి

గడివేముల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి చంద్రుడు డిమాండ్ చేశారు. మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు వేగవంతం జరుగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కంపెనీ ప్రతినిధులు నాణ్యత పేరుతో ఒప్పందం కుదుర్చుకున్న ధరలో కోత విధిస్తున్నారని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వార పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జయప్రతాప్‌రెడ్డి, తిమ్మారెడ్డి, యేసన్న తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పూర్తిస్థాయిలో అమలు చేయాలి

ఆత్మకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్, ఆత్మకూరు మండల అధ్యక్షులు సాయి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులందరికి కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం రూ.13వేలు ఇవ్వడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వంశీ, వెంకట్, చరణ్, మల్లి, ప్రశాంత్ ఉన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

ఆత్మకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల ప్రజాపోరాటాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలో జూలై 6న నిర్వహించే మండల, పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఆత్మకూరు మండల కార్యదర్శి ప్రతాప్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న పేర్కొన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చాంద్‌బాషా, సూర్యనారాయణ ఉన్నారు.

మహానంది: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయడమే సీపీఐ ధ్యేయమని జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో మండల సీపీఐ కార్యదర్శి సామేల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సీపీఐ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు లక్ష్మయ్య, అంజనేయులు, గురుమూర్తి పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ, మండలంలోని అర్హులైన పేదలందరికి ఇళ్లస్థలాలను పంపిణీ చేసి రూ.5లక్షలతో గృహనిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, మాబాషా, నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం పేదలకు ఇళ్లస్థలాలు, పక్కా గృహాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట లబ్దిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, వీరన్న, ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, వలి, కిరణ్ తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్ని మభ్యపెట్టారు

\- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల్ని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజల్ని మభ్యపెట్టారని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కూటమి ఏడాది పాలనలో జరిగిన అవినీతి, అరాచకాలు, దోపిడీ అంశాలపై వైసీపీ ప్రత్యేకంగా రూపొందించిన వెన్నుపోటు పుస్తకాలను స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అనేక హామీలను గుప్పించిన సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే తన మేనిఫెస్టోను చెత్తబుట్టల్లో వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మోమిన్ అహ్మద్ హుసేన్, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, అంజాద్‌అలి, మారుబోతుల విజయ్‌కుమార్, తిరుపమరెడ్డి, ప్రభాకరరెడ్డి, సుల్తాన్ ఉన్నారు.

25 వరకు సచివాలయాల్లో అభ్యంతరాల స్వీకరణ

నంద్యాల నూనెపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తల్లికివందనం పథకం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, ఈ పథకం కింద ఈ నెల 25వరకు సచివాలయాల్లో అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తల్లికివందనం పథకం కింద అనర్హుల జాబితాలో ఉన్నవారు నిరుత్సాహపడకుండా పథకం అమలుకు కావాల్సిన పత్రాలను సచివాలయాల్లో సమర్పించి నమోదు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. సదరు దరఖాస్తులను 26, 27తేదీల్లో పరిశీలించి అందుకు సంబంధించిన నగదును జూలై 5వ తేదీలోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామన్నారు.

- సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వర్షాలవల్ల నీరు కలుషితం కాకుండా మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు.

సీసీ రోడ్డును నాణ్యతగా నిర్మించండి


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డును నాణ్యతగా నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. సోమ వారం పట్టణంలోని ఆటో నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. రూ.23 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్స్ సుంకన్న, ఆర్షు రమణ, మున్సిపల్ ఏఈ సురేష్, కాంట్రాక్టర్ హిమసుధాకర్ రెడ్డి, పూజారి వంశీ, తదితరులున్నారు.

యువత స్వయం ఉపాధిలో రాణించాలి


ఫొటో స్టూడియోను ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధిలో రాణించాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫొటో స్టూడియోను బీసీ రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాలా మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తూ సమయం వృథా చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉందని దానిని గుర్తించి స్వయం ఉపాధివైపు అడుగులు వేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఒకరిని మోసం చేయకుండా కష్టపడి ఏ పని చేసినా తప్పులేదన్నారు. కార్యక్రమంలో జహీర్, సలాం, కలాం, అన్సూ, బచ్చుబాస్కర్, షబ్బీర్, ఇస్మాయిల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని శివాలయం ఆవరణలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బ్రీడ్స్‌యూత్ అధ్యక్షుడు రవికుమార్ వెల్లడించారు. ప్రముఖ వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఐమిత్ర, బ్రీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి అద్దాలు, మందులు అందించనున్నట్లు తెలిపారు.

గ్రీవెన్స్‌లో భూ సమస్యల వెల్లువ

ఆళ్లగడ్డ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధిక సంఖ్యలో భూ సమస్యల పై అర్జీలు వచ్చాయి. ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు తహసీల్దార్ భరోసా ఇచ్చారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ కిషోర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

వ్యవసాయాధికారిగా కలిమున్నీసా

అవుకు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా కలిమున్నీసా సోమవారం బాధ్యతలు చేపట్టారు. నందికొట్కూరు వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై అవుకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అనంతపురం జిల్లా నల్లమాడకు బదిలీ పై వెళ్లారు.

జోనల్‌స్థాయికి ఆళ్లగడ్డ క్రీడాకారిణి ఎంపిక


రిశ్వహర్షిత

ఆళ్లగడ్డ జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డకు చెందిన క్రీడాకారిణి రిశ్వహర్షిత రాయలసీమ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనపరిచి జోనల్ టీంకు ఎంపికైనట్లు కోచ్ సుబ్బ రాయుడు సోమవారం తెలిపారు. జోన్‌పోర్ కేటగిరిలో కర్నూలు జిల్లా నుంచి ఎంపికైందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఐదుగురు బాలికలు ఎంపికయ్యారని తెలిపారు. హర్షిత జోనల్ టీంకు ఎంపిక కావడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

● విద్యుత్ డీఈఈ కమలాకర్‌రావు

డోన్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీని 15 రోజులు మాత్రమే అవకాశం ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ డీఈఈ కమలాకర్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు గతంలో రూ. 2వేలు ఉండేదని, ప్రస్తుతం 50 శాతం రాయితీలో రూ.1000లు మాత్రమే చెల్లించొచ్చన్నారు. ఏపీఎస్‌డీపీఎస్‌ఎల్ వెబ్‌సైట్‌లో గానీ, విద్యుత్ ఉపకేంద్రంలో అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పని వేళలు పాటించని సిబ్బంది


అధికారుల కోసం వేచిఉన్న ప్రజలు

సంజామల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు గత వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. అయితే కొంత మంది సిబ్బంది పనివేళలు పాటించకుండా ఇష్టానుసారంగా రావడం, వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ఉదయం 11గంటలు దాటినా ఆకుమళ్ల సచివాలయానికి అధికారులు రాలేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చినా ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి చోటుచేసుకుంది. సంబంధిత ఉన్నతాధికారులు సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం (ఆప్కాస్) కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డోన్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణ ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జీవో.26 ప్రకారం వేతనాలు చెల్లించాలని, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ దీక్ష ఈ నెల 22 అర్ధరాత్రి నుంచి ఉద్యోగులు సమ్మెకు దిగుతున్నామని తెలిపారు. కార్మికులు చంద్ర, రవికుమార్, రవి, సంజీవ,ఇస్మాయిల్, అజయ్, లక్ష్మీదేవి, అరుణ, ఈశ్వరమ్మ, షాన్‌బీ, రంగా, మల్లేష్, పాల్గొన్నారు.

యంత్రసాయం

● కరువైన కాడెద్దులు
● అన్నింటికీ యంత్రాల వినియోగం
● సాగుకు రైతులు సన్నద్ధం
● సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూపులు

చాగలమర్రి/కొలిమిగుండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక సమాజంలో వ్యవసాయంలో కూడా శాస్త్ర సాంకేతిక మార్పులు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ వ్యవసాయ సాగేది. నేడు మాత్రం వ్యవసాయంలో అధిక శాతం యంత్రాలనే వాడుతున్నారు. కూలీల కొరత కూడా ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. కాడెద్దులు కొనే స్థోమత లేక రైతులు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఒక జత కాడెద్దులు ధర రూ.50వేల నుంచి రూ.80వేలు ఖర్చు అవుతుంది. వాటి నిర్వహణ సంవత్సరానికి రూ.20వేల వరకు అవుతుంది. అదే ట్రాక్టర్‌తో ఒక ఎకరా దున్నడానికి రూ.1000 ఖర్చు అవుతోంది. విత్తనాలను వేసేందుకు యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో అధిక శాతం వ్యవసాయం యాంత్రీకరణపైనే ఆధారపడింది.


చాగలమర్రిలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతన్న

ఆశల సాగుకు సన్నద్ధం

ముందస్తు వర్షాల నేపథ్యంలో రైతులు ఎంతో ఆశతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు విత్తనం వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది పంటలు వర్షాలు లేక తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా నమ్ముకున్న భూమి గట్టెక్కించకపోదా అని రైతులు మరోసారి పంటల సాగుకు సిద్ధమయ్యారు. పొలాలను దున్నడంలో రైతులు బిజీబిజీ అయ్యారు. సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.

పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం అందించాలి

పాడి పరిశ్రమకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందిస్తే పశు సంపద పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పశువుల కొనుగోళ్ల నుంచి పశుగ్రాసం, ఎరువులు ఇలా అన్నింటా అన్నదాతను ఆదుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.


కొలిమిగుండ్లలో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

పోషణ భారంగా మారింది



మాపెద్దల కాలం నుంచి ఎద్దులతోనే వ్యవసాయం చేసేవాళ్లం. అయితే ఇటీవల పశువుల పోషణ భారంగా మారింది. దీంతో ఎద్దులను అమ్మివేశాను. ప్రస్తుతం ఊరంతా నాలుగు కాండ్లు మించి లేవు.

- పోరెడ్డి నారాయణరెడ్డి, రైతు, మీర్జాపురం

యంత్రాలైతే త్వరగా..



నా చిన్నతనంలో మా ఇంట్లో రెండు మూడు జతల కాడెద్దులు ఉండేవి. గ్రామాల్లో రైతుల వద్ద ఎద్దులు లేకపోవడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉంది. యంత్రాలైతే త్వరితగతిన విత్తనాలు వేయవచ్చు.

- నాగేశ్వరరెడ్డి రైతు,కొలిమిగుండ్ల

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

● తహసీల్దార్ విజయశ్రీ

శిరివెళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. శిరివెళ్ల తహసీల్దార్‌గా పని చేస్తున్న పుష్పకుమారి నంద్యాల ఆర్డీవో కార్యాలయానికి బదిలీకాగా కర్నూలు కలెక్టరేట్ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న విజయశ్రీ బదిలీపై శిరివెళ్లకు వచ్చారు. మండలంలోని వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీటీ కిషోర్, ఆర్ఐ రాఘవేంద్ర, సర్వేయర్ చిన్న మల్లయ్య పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ విజయశ్రీని మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకులు బాలచంద్రుడు, రవి మర్యాదపూర్వకంగా కలిశారు.

చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాదులు

శిరివెళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాదులని శిరివెళ్ల అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శిరివెళ్లలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ర్యాలీలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

బనగానపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్ పెట్రోల్‌బంకులో డిజిటల్ లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కేడం సుబ్బరాయుడు, పూలరాజు కోరారు. సోమవారం తహసీ ల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సబ్‌జైల్ పెట్రోల్‌బంకులో డిజిటల్ లావాదేవీలు జరుగకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ విషయాన్ని జిల్లా సబ్‌జైల్ అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

బడి వయసు పిల్లలను బడిలో చేర్పించాలి

బనగానపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బడి వయసు పిల్లలను బడిలో చేర్పించాలని బనగానపల్లె ప్రభుత్వ కస్బా ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం సుంకన్న, ఉపాధ్యాయులు సత్యప్రకాశ్, అబ్దుల్ కలీంలు కోరారు. సోమవారం వారు పిల్లలను బడిలో చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రీ వెరిఫికేషన్‌లో పెరిగిన మార్కులు

- మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి


కళ్యాణ్‌బాబు

కొలిమిగుండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రీ వెరిఫికేషన్‌లో ఓ విద్యార్థికి ఏకంగా 19మార్కులు పెరిగాయి. దీంతో అతడు మండల టాపర్‌గా నిలిచాడు. కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్‌లో గొర్విమానుపల్లె గ్రామ విద్యార్థి జడలమ్మగారి కళ్యాణ్‌బాబు 10వ తరగతి చదివాడు. ఫలితాల్లో 562 మార్కులు వచ్చాయి. మార్కులు తక్కువగా రావడంతో రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేశాడు. సోమవారం వచ్చిన ఫలితాల్లో ఏకంగా 19 మార్కులు పెరిగి 581 మార్కులు సాధించాడు. మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో విద్యార్థి కళ్యాణ్‌బాబును ఉపాధ్యాయులు, గ్రామస్థులుఅభినందించారు.

ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

● ఆందోళనలో నందవరం గ్రామస్థులు


కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

బనగానపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నందవరం గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మ ర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓ బర్రె తాకడంతో మృతి చెందింది. గతంలో కూడా ఇక్కడ విద్యుదాఘాతంతో పలు ప్రమాదాలు సంభవించాయని గ్రామస్థులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు అనేక మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. పెద్ద ప్రమాదాలు సంభవించకుండా కంచె ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నందవరం గ్రామస్థులు కోరుతున్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

● మళ్లీ అధికారం మాదే ● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డోన్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైన తల్లికి వందనం అమలుతో విద్యార్థుల తల్లుల్లో సంతోషం వ్యక్తం అవుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద ఒక విద్యార్థికి మాత్రమే నిధులు జమ చేశారన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలు బడులకు వెళ్తుంటే.. అందరికీ తల్లుల ఖాతాలో నగదు జమ చేయడం హర్షణీయమన్నారు. 2029లో ఎన్నికల్లో కూడా టీడీపీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. సాగు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో ఇంటింటికి కొళాయిల ఏర్పాటు చేస్తామని వాటికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు

డోన్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 18ఏళ్లలోపు బాలబాలికలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని లేబర్ ఆఫీసర్ శోభా రాణి హెచ్చరించారు. బాల కార్మికుల నిర్మూలనపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ బాల కార్మికుల నిర్మూలన కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సంరక్షణ అధికారి శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థలు, హెర్ఫ్ సంపత్, రాజు, కానిస్టేబుల్ నాగ భూషణం ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బేతంచెర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ముందు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అరాచకాలపై పోరాటం చేస్తామన్నారు. పేద విద్యార్థులకు విద్యను అందుబాటులో ఉంచాలని కోరిన విద్యార్థి సంఘం నాయకుడిపై అసత్య ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. విద్యను వ్యాపారం చేస్తున్న పాఠశాలలో అమ్ముతున్న బుక్స్‌ను బయట ప్రదర్శించి నిరసన తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థలపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐ వెంకటేశ్వర రావును, ఎంఈవో సోమశేఖర్‌లకు ఫిర్యాదు చేశారు. నాయకులు శశిధర్ రెడ్డి, మల్లికార్జున, రోహిత్, అస్లాం, ఎల్లకృష్ణ, మధు, ప్రదీప్ సాయి, రాజవంశీ, రాజారమేష్, గణేష్, ఆదిత్య నాగరాజు, యువరాజు పాల్గొన్నారు.

ఇంటి నుంచి తల్లిని గెంటేసిన కూతురు

● పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు

కోవెలకుంట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తనకున్న ఇంటిని బిడ్డ పేరు మీద రాసిచ్చిన తల్లిని ఆ ఇంటి నుంచే కూతురు, అల్లుడు గెంటేసిన విషాదకర సంఘటన కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో చోటు చేసుకుంది. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన ఈశ్వరమ్మ అనే వృద్ధురాలు తనకున్న సొంత ఇంటిలో నివాసం ఉంటోంది. అయితే ఇటీవల కూతురు అన్నపూర్ణ, అల్లుడు రాఘవరెడ్డి మాయమాటలు చెప్పి అన్నపూర్ణ పేరుమీద రాయించుకున్నారు. ఇటీవల ఇల్లు విడిచి వెళ్లాల్సిందిగా ఒత్తిడి చేసేవారు. అయితే సోమవారం ఇంటి నుంచి ఏకంగా బయటకు గెంటేశారు. దాంతో బాధితురాలు ఈశ్వరమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

బోరు విషయంలో వాగ్వాదం

ఉయ్యాలవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బోరు విషయంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వివాదం చోటు చేసుకుంది. సోమవారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్నవెంకటసుబ్బయ్య ఆర్వో ప్లాంటు బోరు పనిచేయకపోవడంతో దాని పక్కన వృథాగా ఉన్న చేతిబోరుకు మరమ్మతులు చేసుకుంటుండగా బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి అడ్డుకున్నాడు. వైసీపీ నాయకుడు బుడ్డ చంద్రమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకుని పంచాయతీ బోరుకు మరమ్మతులు చేసి తమ సొంత అవసరాలకు ఎలా వాడుకుంటారని ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య కాసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. విషయం పోలీసులకు తెలియడంతో ఎస్ఐ సత్యనారాయణ అక్కడికి చేరుకుని వివాదాన్ని సర్దుమణిగించాడు. అనంతరం ఇరువురు పెద్దలతో మాట్లాడి రెండు నెలల పాటు బోరును ఉపయోగించుకోవచ్చని పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి వివాదానికి తెరదింపారు.

మలేరియా నివారణకు చర్యలు

చాగలమర్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి తెలిపారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కేపీ తండా గ్రామంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గిరిజనులకు అవగాహ న కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, హెచ్‌ఈ రాముడు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డోన్ సబ్ ట్రెజరీ అధికారిగా సునీల్ కుమార్

డోన్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ ట్రెజరీ అధికారిగా సునీల్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సబ్ ట్రెజరీ అధికారి రఘునందన్ ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు. సబ్ ట్రెజరీ కార్యాలయం సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్‌ను సత్కరించారు.

6,500 పక్కా గృహాలు పూర్తి


చాగలమర్రిలో లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటున్న హౌసింగ్ డీఈ

చాగలమర్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 12,479 పక్కా గృహాలకు గాను 6,500 గృహాలు పూర్తయ్యాయని హౌసింగ్ డీఈ విజయ్‌బాబు తెలిపారు. సోమవారం చాగలమర్రి కస్తూర్బా పాఠశాల వద్ద లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల చివరి నాటికి వివిధ దశల్లో ఉన్న గృహాలను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ సుబ్బరామయ్య, సలీమ్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

చాగలమర్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు ఎంఈవో న్యామతుల్ల, హెచ్‌ఎం శివలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో సన్నబియ్యంతో వండిన ఆహార పదార్థాలను వారు పరిశీలించారు. సీఆర్పీ అమీర్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని గుడిసె దగ్ధం

చాగలమర్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గుడిసె దగ్ధమైందని, విద్యుదాఘాతం కాదని విద్యుత్‌శాఖ ఏఈ రమణయ్య తెలిపారు. విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం అన్న శీర్షిక సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన ఏఈ గుడిసెకు విద్యుదాఘాతంతో జరగలేదన్నారు. గుడిసెకు విద్యుత్ మీటర్ కూడా లేదని అన్నారు.

రెగ్యులర్ ఏవోగా సుమతి బాధ్యతలు

రుద్రవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రెగ్యులర్ ఏవోగా సుమతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రైతులకు అందుబాటులో ఉండి నూతన వ్యవసాయంపై ఎప్పటికప్పుడు సలహాలు అందిస్తామన్నారు. వీఏఏలను అప్రమత్తం చేసి రైతు సేవాకేంద్రాల్లో ఉండి సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం నుంచి మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో సుమతి తెలిపారు. 17న జె.కొత్తూరు, 18న కోటకొండ, 24న డికొట్టాలు, 25న బీరవోలు, జూలై 1న అప్పనపల్లె, 2న కొండమాయపల్లె, 8న పేరూరు, 9న చిలకలూరు, 15న నక్కలదిన్నె, 16న నల్లవాగుపల్లె, 22న తిప్పారెడ్డిపల్లె, 23న తిమ్మనపల్లె, 29న ముకుందాపురం, 30న హరినగరంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రుద్రవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దారు మల్లికార్జునరావు సూచించారు. సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు

శిరివెళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం బోయలకుంట్ల ప్రభుత్వ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వెలసిన రామస్వామి, ఈశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు చెందిన 69.2 ఎకరాల భూములకు బుధవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు గ్రూపు దేవాలయాల ఈవో టీవీ నరసయ్య సోమవారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఏడాది కాలపరిమితితో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు నిర్ణీత రుసుమును డిపాజిట్‌గా చెల్లించి పాల్గొనాలని కోరారు.

విచ్చలవిడిగా విక్రయాలు

- క్షణికావేశంలో పేడ రంగు తాగుతున్న మహిళలు
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు - పట్టించుకోని అధికారులు

కొలిమిగుండ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లాలో పలువురు ఆత్మహత్యకు కల్లాపికి ఉపయోగించే పేడరంగును నీళ్లలో కలుపుకుని తాగి మృతి చెందుతున్నారు. కుటుంబ వివాదాలు, ఆర్థిక సమస్యల కారణంగా క్షణికా వేశానికి లోనవు తున్న మహిళలు ఇంట్లో అందుబాటులో ఉండే పేడరంగు తాగి ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 20మందికిపైగా ఆత్మహత్యకు పాల్పడం గమనార్హం. ఎటు వంటి అనుమతులు తీసుకోకుండానే పలుచోట్ల ఇష్టానుసారంగా తయారు చేసి, చిన్నచిన్న పొట్లాల్లో నింపుతూ మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నారు. ధర కూడా అతి తక్కువగా రూ.5 మాత్రమే ఉండటం, రంగు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. చిన్న చిన్న దుకాణాల్లో సైతం లభ్యమవుతుండటంతో క్షణికావేశానికి లోనవుతున్న మహిళలు పేడరంగు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. విక్రయా లను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమ య్యా రనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విక్రయాలపై దుకాణాదా రులకు హెచ్చరికలు జారీ చేస్తున్నా ఏమాత్రం ఆగడంలేదు. అత్యంత ప్రమాదకరమైన ఈ రంగును మార్కెట్లో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు వురు అభిప్రాయ పడుతున్నారు.

విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తాం



పేడరంగు తాగి మహిళలు ఆత్మహత్య చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తుంది. పేడ రంగు విక్రయాలపై చర్య లు తీసుకుంటున్నాం. మహిళా పోలీసుల ద్వారా గ్రామాల్లోని దుకాణాల్లో తనిఖీ చేయిస్తున్నాం. కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలి. కిరాణం దుకాణాల్లో పేడరంగులు విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

- మద్దినేని రమేష్‌బాబు, సీఐ, కొలిమిగుండ్ల